## క్యాన్సర్‌పై ఎల్బీ విద్యార్థుల అవగాహన ర్యాలీ

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 16 : లాల్ బహదూర్ కాలేజీలో ఎన్‌సీసీ పదో తెలంగాణ బెటాలియన్ ఆర్మీ విభాగం ఫుడ్ క్లీనింగ్ ప్రోగ్రాం, టొబాకో నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే రాజేందర్‌రెడ్డి తెలిపారు. డిఫెన్స్, ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు కాలేజీ నుంచి ములుగురోడ్డు జంక్షన్, అలంకార్ జంక్షన్ వరకు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై స్కిట్లు నిర్వహించారు. కర్నల్ అజయ్‌నంద కందూరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలేజీ ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎం సదానందం, పవన్, విష్ణు, రాజు, ఓంశ్రీ, రాధిక, సృజన, భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.

## కుట్టుమిషన్ల పట్టివేత

నడికూడ, నవంబర్ 16 : మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, డీసీఎం వ్యానులో తరలిస్తున్న యాభై కుట్టుమిషన్లు, కుర్చీలను అధికారులు గురువారం పట్టుకున్నారు. వాటికి సరైన పత్రాలు లేకపోవడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అప్పగించినట్లు వారు తెలిపారు.



చెక్ పోస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్న కుట్టుమిషన్లు

# పరకాల.. ప్రగతి బావుటా

- రూ.5.5వేల కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి
- దేశంలోనే అతిపెద్ద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు
- సొంత రాష్ట్రంలో మారిన పరకాల ముఖచిత్రం
- రెవెన్యూ డివిజన్ హోదా పునరుద్ధరణ
- శరవేగంగా వంద పడకల దవాఖాన నిర్మాణం



పరకాల పట్టణ వ్యూ

పరకాల, నవంబర్ 16 : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పరకాల నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న పరకాలలో ప్రత్యేక రాష్ట్రంలో రూపురేఖలు మారాయి. తొమ్మిదిన్నరేండ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యంతో పరకాల నుంచి ములుగుకు తరలిపోయిన రెవెన్యూ డివిజన్ ప్రత్యేక రాష్ట్రంలో తిరిగి వచ్చింది. నియోజకవర్గంలోని గీసుకొండ, సంగెం మండలాల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తున్నది. దామెర, నడికూడ కేంద్రాలుగా రెండు నూతన మండలాలను ఏర్పాటు చేయగా పాలన ప్రజలకు చేరువైంది. పలు మండలాలతో పాటు పరకాల మున్సిపాలిటీలో కార్పొరేట్ స్థాయిలో పాలనా భవనాలను నిర్మించుకోగా.. పరకాల ప్రాంత చిరకాల వాంఛ అయిన వంద పడకల దవాఖాన నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్నది.

### 1200 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కు..

దేశంలోనే అతిపెద్ద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును పరకాల నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ కేటాయించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని గీసుకొండ మండలం శాయంపేట, సంగెం మండలం చింతలపల్లి శివారులో 1200 ఎకరాల్లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును నెలకొల్పారు. ఈ టెక్స్‌టైల్ పార్కులో భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థలు ఆసక్తి చూపుతుండడంతో మౌలిక వసతులు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తును నిధులును మంజూరు చేసింది. ఇప్పటికే వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.450కోట్లతో అంతర్గత రహదారులు, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ, 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మించారు. అంతే కాకుండా కంపెనీలకు అవసరమయ్యే నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. రూ.178కోట్లతో 220కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం, రూ.100 కోట్లతో నీటి సరఫరా పనులు చేపట్టగా, టెక్స్‌టైల్‌పార్కులో వ్యర్థ జలాల శుద్ధీకరణకు రూ.83కోట్లతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టారు. టెక్స్‌టైల్ పార్కు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల ఉపాధికి కేంద్ర బిందువుగా నిలువనుంది. ఇప్పటికే గణేశా ఎకోటెక్, ఎకోపెట్ పరిశ్రమలను నెలకొల్పారు. వీటిలో ఉత్పత్తిని మంత్రి కేటీఆర్ ప్రారంభించగా కేరళ రాష్ట్రానికి చెందిన కిటెక్స్ కంపెనీ వస్త్ర పరిశ్రమల స్థాపనకు భూమిపూజ చేసింది. పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అంతే కాకుండా సౌత్ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీలు పరిశ్రమల నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు సిద్ధమవ్వగా మరికొన్ని కంపెనీలు టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టే దిశగా అడుగులు వేస్తున్నాయి. కాగా, టెక్స్‌టైల్ పార్కులో పలు పరిశ్రమల నిర్మాణాలు పూర్తయి ఉత్పత్తి ప్రారంభమైతే నియోజకవర్గం ఉపాధికి కేంద్ర బిందువుగా మారుతుంది.

### మారిన పరకాల ముఖచిత్రం..

అభివృద్ధి పరుగులు పెట్టడంతో పరకాల ముఖచిత్రం మారిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో పరకాల రెవెన్యూ డివిజన్‌గా కొనసాగుతుండగా అప్పటి టీడీపీ ప్రభుత్వ పాలకులు కుట్రలు చేసి పరకాల నుంచి రెవెన్యూ డివిజన్‌ను రాత్రికి రాత్రే ములుగుకు తరలించారు. దీంతో పరకాల ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడగా.. ఈ ప్రాంతం వెనుకబాటుకు గురైంది. దీన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ పరకాలను రెవెన్యూ డివిజన్‌గా 2018లో ప్రకటించారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం నూతన మండలాలు, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో ప్రజలకు పాలన చేరువైంది. నియోజకవర్గ వ్యాప్తంగా నడికూడ, దామెర కేంద్రాలుగా రెండు నూతన మండలాలను ఏర్పాటు చేయడంతో పాటు 21తండాలు, శివారు గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా రూ.కోట్లతో పాలనా భవనాలను కార్పొరేట్ స్థాయిలో నిర్మించారు. అంతే కాకుండా హనుమకొండ రోడ్డుపై వంద పడకల దవాఖాన నిర్మాణాన్ని చేపట్టారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు, నిర్వహణకు రూ.7.88కోట్లు కేటాయించగా మూడు అంతస్తుల్లో లక్ష చదరపు అడుగుల్లో పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని పరకాల మండలం వెల్లంపల్లి, నడికూడ మండలంలోని చర్లపల్లి, వరికోల్, ఆత్మకూరు మండలంలోని గూడెప్పాడ్, కటాక్షపూర్, సంగెం మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించడంతో పాటు లబ్ధిదారులకు పంపిణీ చేసి, పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసింది.



కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో నిర్మిస్తున్న రోడ్డు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★Need an Accountant (1-2 years Experience) and Pharmacist (0-2years) for reputed Hospital in Hanamkonda. Cont: 7337222096.
NTW-322861

WANTED

★మీరు మీ గ్రామంలో 10th , ఇంటర్, డిగ్రీ, చదివి ఖాళీగా ఉన్నారా? ఈ అవకాశం మీసోసం. సంప్రదించండి!!
సెల్: 6281277956
NTK-322140

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA
9182777563
9182777618
9182777213

WARANAGAL
9182777556
9182777557
9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565



కేడీసీకి అటానమస్ హోదా రావడంతో ప్రిన్సిపాల్ రాజారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న అధ్యాపకులు

## కేడీసీకి అటానమస్ హోదా

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 16 : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాల న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించి యూజీసీ అటానమస్ హోదా పొందింది. దీనివల్ల ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలున్న కోర్సులు అందుబాటులోకి వస్తాయి. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా జీసీజీటీఏ కార్యవర్గం, పింగిలి కళాశాల, కేడీసీ కళాశాల యూనిట్ కార్యవర్గ సభ్యులు కళాశాల ప్రిన్సిపాల్ జీ రాజారెడ్డి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బీ రమేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జీసీజీటీఏ కాకతీయ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ డీ రామకృష్ణారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డీ వెంకన్న, శిరీష, ఏ అశోక్, ఇందిరా నైనాదేవి, పార్వతి, స్నేహలతారెడ్డి, జీ సుహాసిని, కే కిరణ్, కే సునీత, సుజాత, మాధవి, రేణుక పాల్గొన్నారు.

# నేడు పరకాలకు సీఎం కేసీఆర్

- లక్ష మందితో భారీ సభ
- సిద్ధమైన హెలిప్యాడ్
- వేగంగా సాగుతున్న సభా ప్రాంగణ నిర్మాణ పనులు
- ఏర్పాట్లను పరిశీలించిన వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

పరకాల, నవంబర్ 16 : ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పరకాలకు సీఎం కేసీఆర్ రానున్నారు. పట్టణంలోని వెల్లంపల్లి రోడ్డులో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. సీఎం సభ కోసం పట్టణ శివారులో 12 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. సభకు సుమారు 70 వేల నుంచి లక్ష మంది బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు రానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దఎత్తున వేదికను సిద్ధం చేస్తున్నారు. సభా స్థలం పక్కనే హెలిప్యాడ్‌ను నిర్మించారు. వాహనాల పార్కింగ్‌కు దామెర చెరువు కట్ట, పశువుల సంత, వెల్లంపల్లిలోని ప్రైవేట్ స్థలాన్ని నిర్వాహకులు ఎంపిక చేసి చదును చేశారు. కాగా, బహిరంగ సభ ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పరిశీలించి, అధికారులు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సీపీ సీఎం సభ కోసం ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ జూపల్లి వెంకటరత్నం పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సభ కోసం జరుగుతున్న ఏర్పాట్లు

